క్లుప్తంగా

వేసవి శిక్షణ శిబిరాలతో ఎంతో మేలు


మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

పొదిలి: వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి సూచించారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో శిక్షణ శిబిరాన్ని ఆమె పరిశీలించారు. గ్రంథాయాల ప్రాధాన్యత, పిల్లలకు, విద్యార్థులకు, పెద్దలకు ఉపయోగపడుతున్న తీరును వివరించారు. పుస్తక పఠనం, చిత్రలేఖనం, కథలు చెప్పించడం, ఆటపాటలతో కూడిన కార్యక్రమాల గురించి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు కె.శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


పాడి గేదె కళేబరం

రాచర్ల: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని ఆకవీడులో బుధవారం జరిగింది. వివరాలకు.. ఆకవీడు గ్రామానికి చెందిన వల్లపురెడ్డి జయరామిరెడ్డికి చెందిన పాడి గేదె గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని రైతు జయరామిరెడ్డి తెలిపారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు


వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, చెస్, క్యారమ్స్, కథలు చెప్పడంపై శిక్షణ ఇచ్చారు. వేసవి విజ్ఞాన శిబిరంలో 33 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఉపాధ్యాయుడు పీవీ గురుస్వామి పాల్గొన్నారు.

సమయం ఏది మిత్రమా?


టైమింగ్ బోర్డులు లేని ఓ బస్సు

పొదిలి: ఆర్టీసీ బస్సుల్లో టైమింగ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పొదిలి డిపో నుంచి అద్దంకి, కనిగిరి, ఒంగోలు వైపు ఎక్కువగా బస్సు సర్వీసులు ఉన్నాయి. ప్లాట్‌ఫాంపై ఉన్న బస్సులో ఎక్కి కూర్చున్న ప్రయాణికులు అది కదిలేంత వరకు వేచి చూడాల్సి వస్తోంది. మరో డిపో బస్సు వస్తే ప్రయాణికులు వెంటనే బస్సు దిగి వెళ్తున్నారు. కొందరైతే బస్సు ఎప్పుడు బయలుదేరుతుందో తెలియక అలానే కూర్చుంటున్నారు. దీంత సమయం వృథా అవుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి టైమింగ్ బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

శివరామపురంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్


శివరామపురంలో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని శివరామపురంలో బుధవారం సాయంత్రం ఎస్‌ఐ వైవీ రమణయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ముగిసేంత వరకూ గ్రామాల్లో రాజకీయ పార్టీల నేతలు సంయమనం పాటించాలన్నారు. కౌంటింగ్ రోజు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, సంబరాలకు అనుమతి లేదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని నాయకులు, కార్యకర్తలు సహకరించాలన్నారు. కౌంటింగ్ రోజు రెచ్చగొట్టే చర్యలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ చేశారు.


ప్రజలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్సైలు అబ్దుల్ రెహమాన్, నాయక్


మర్రిపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు

వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు

- మార్కాపురం, పొదిలి సీఐల హెచ్చరిక
- రాయవరంలో ఏడుగురు బైండోవర్
- పట్టణ శివారులో 10, పోతవరంలో 6 వాహనాలు సీజ్


పోతలపాడులో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మల్లికార్జున్, ఎస్సైలు

మార్కాపురం: ఓట్ల లెక్కింపు సందర్భంగా జూన్ 4వ తేదీన మార్కాపురంలో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు సీఐ ఆవుల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం పట్టణ శివారులోని డ్రైవర్స్ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పది వాహనాలు సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ.. కౌంటింగ్ రోజున, ఆ తర్వాత మార్కాపురం పట్టణం, రూరల్‌లో గొడవలకు పాల్పడినా, సోషల్‌మీడియా వేదికగా వదంతులు వ్యాప్తి చేసినా రౌడీ షీట్ నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. వదంతులను నమ్మవద్దని, అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాటిళ్లలో పెట్రోల్ పోయవద్దని బంకుల యజమానులకు సూచించారు. ఆయన వెంట ఎస్సైలు అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వరనాయక్ తదితరులు ఉన్నారు.

ఏడుగురు అనుమానితులు బైండోవర్

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం గ్రామ శివారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురిని బైండోవర్ చేసినట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ తెలిపారు. గుప్త నిధుల తవ్వకాలకు వచ్చినట్లు అనుమానంగా ఉందని సీఐ ఆవుల వెంకటేశ్వర్లుకు గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఒకరు, రాయవరం గ్రామానికి చెందిన ఇద్దరు, మన్నెంవారిపల్లికి చెందిన ఒకరు, అర్ధవీడుకు చెందిన మరొకరు, మార్కాపురానికి చెందిన ఒకరు ఉన్నట్లు గుర్తించారు. అనుమానితుల సెల్ ఫోన్‌లో గుళ్ల, గోపురాలకు సంబంధించిన వీడియోలు, గుప్తనిధుల సమాచారం ఉండటంతో పూర్తి స్థాయిలో విచారించారు. వారి వివరాలు తీసుకుని అందరినీ 107 సెక్షన్ కింద బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

వివాదాలకు దూరంగా ఉండండి

తర్లుపాడు: గ్రామాల్లో ప్రజలు వివాదాలకు దూరంగా ఉండాలని పొదిలి సీఐ మల్లికార్జున్ సూచించారు. మండలంలోని పోతలపాడులో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 6 వాహనాలను సీజ్ చేశారు. గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చేందుకు అనుమతి లేదని చెప్పారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఉండేందుకు, ప్రజలకు భరోసా కల్పించేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు చెప్పారు. ఉద్రిక్తలకు పాల్పడేవారిని గుర్తించేందుకు పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్సై వేముల సుధాకర్, పొదిలి ఎస్సై కోటయ్య, కొనకనమిట్ల ఎస్సై మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కొనకనమిట్ల: ఎన్నికల కౌంటింగ్ రోజున అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మాధవరావు హెచ్చరించారు బుధవారం మండలంలోని మర్రిపాలెం, నాగిరెడ్డిపల్లి, ఇరసలగుండం, చినారికట్ల గ్రామల్లో రాజకీయ పార్టీల నాయకులతోపాటు ప్రజలతో సమావేశాలు నిర్వహించి శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా అందరూ కలిసి మెలసి ఉండాలని సూచించారు. కొనకనమిట్ల వద్ద జాతీయ రహదారిపై పలు వాహనాలను తనిఖీ చేశారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాజానగర్ జగనన్న కాలనీల్లో స్థానిక సీఐ వైవీ సోమయ్య కార్డన్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కాలనీలోని గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ తన సిబ్బందితో సహా కలిసి కాలనీలోని ప్రతి గృహాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల సమయంలో ఎక్కడా ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరిస్తూ గృహాల్లో తనిఖీలను ప్రోత్సహించాలన్నారు. అందరి రక్షణ పోలీసుల బాధ్యత అని, అందులో భాగంగానే ప్రతి గృహాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ చట్టాన్ని గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేని 6 బైక్‌లను గుర్తించి వాటిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎస్సై తోట వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


బైక్‌లతో సీఐ, పోలీసులు

పది మోటార్ సైకిళ్లు సీజ్


సీజ్ చేసిన వాహనాలతో సీఐ, ఎస్సైలు


కొమరోలు: బైకులు సీజ్ చేసిన సీఐ దాసరి ప్రసాద్

అర్ధవీడు (బేస్తవారిపేట): మండలంలోని కాకర్లలో కంభం సీఐ జె.రామకోటయ్య, ఎస్సై ఎం.అనితల ఆధ్వర్యంలో బుధవారం కార్డెన్ సెర్చ్ చేశారు. గ్రామంలో పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. శాంతిభద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో, కౌంటింగ్ అనంతరం ఎటువంటి అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. ఎటువంటి ధృవీకరణ పత్రాలు లేనటువంటి 10 బైక్‌లను సీజ్ చేశారు. కంభం, బేస్తవారిపేట ఎస్సైలు పులి రాజేష్, నరసింహారావు, పోలీసులు పాల్గొన్నారు.

కొమరోలు: ఎస్పీ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు మండలంలోని యర్రగుంట్లలో బుధవారం గిద్దలూరు రూరల్ సీఐ దాసరి ప్రసాద్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేని 6 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ దాసరి ప్రసాద్ మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడ కూడదన్నారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని తెలిపారు. కౌంటింగ్ అయినా జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎస్సై మధుసూదన్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వార్డెన్‌కు ప్రశంస పత్రం


వార్డెన్, విద్యార్థికి ప్రశంసపత్రం అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్ల బీసీ హాస్టల్ వార్డెన్ కె.లక్ష్మీకాంతరెడ్డి.. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని మంగళవారం అందుకున్నారు. హాస్టల్ విద్యార్థి ఎస్‌వీ భరత్ పదో తరగతిలో 589 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా ఒంగోలులో జరిగిన ప్రతిభ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో విద్యార్థి ఎస్‌వీ భరత్‌కు ప్రతిభ అవార్డ్, వార్డన్ లక్ష్మీకాంతరెడ్డికి ప్రశంస పత్రాన్ని అందచేశారు.

అపరిశుభ్రంగా సాగర్ నీరు


మలినాలతో కూడిన సాగర్ నీరు

పొదిలి: స్థానిక తూర్పుపాలెంలో పది రోజుల తర్వాత సరఫరా అయిన సాగర్ నీరు అపరిశుభ్రంగా ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని, ఈ తరుణంలో మురుగు నీరు సరఫరా కావడంతో వాటిని ఎలా వినియోగించుకోవాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నీరు దుర్వాసన వస్తున్నాయని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదనే ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పరిశుభ్రమైన నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని తూర్పుపాలెం వాసులు కోరుతున్నారు.

మళ్లీ సూర్యుడి ఉగ్రరూపం

కొమరోలు: వారం పది రోజులుగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తూ వాతావరణం చల్లబడింది. దీంతో మండలంలోని ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో సేద తీరుతూ సరదాగా గడిపారు. రెండు రోజులుగా మళ్లీ సూర్యుడు ఉగ్రరూపాన్ని చూపిస్తున్నాడు. మంగళవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా బుధవారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యుడు వేడితో పాటు ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం


మద్యం బాటిళ్లతో సెబ్ అధికారులు

గిద్దలూరు రూరల్: ఓ వ్యక్తి బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్థానిక సెబ్ సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో సెబ్ అధికారులు బుధవారం గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని ఓ మైనర్.. గోవాకు చెందిన 30 మద్యం బాటిళ్లను ఎటువంటి రసీదులు లేకుండా అక్రమంగా తరలిస్తుండగా పట్టణ శివారులో అంబవరం రైల్వే బ్రిడ్జి సమీపంలో అదుపులోకి తీసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మద్యం బాటిళ్లతో పాటు అతడి బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. బాలుడు గతంలో బ్లేడుతో అనేక మందిపై దాడి చేసి గాయపరిచిన కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడు. మైనర్ కావడంతో అతడిని తిరుపతిలోని మైనర్ల కోసం ఉండే ప్రత్యేక హోమ్‌కు తరలించనున్నట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు. అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, అలాంటి వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు.

మల్లెలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


రైతులకు సూచనలిస్తున్న శ్వేత

కంభం: మల్లెలో నాణ్యమైన పూల దిగుబడి పొందేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవనశాఖ అధికారిణి డి.శ్వేత అన్నారు. మండలంలోని రావిపాడులో సాగు చేస్తున్న పూలతోటలను ఉద్యానవనశాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. వేసవి కాలంలో మల్లె మొక్కలను నల్లి ఎక్కువగా ఆశించి విపరీతంగా నష్టాన్ని కలుగజేస్తుందని రైతులకు తెలిపారు. ప్రస్తుత వాతావరణంలో వీటి సంతతి అతివేగంగా అభివృద్ధి చెందుతుందని, ఇవి ఆకుల అడుగు భాగాన్ని చేరి ఆకుల నుంచి రసాన్ని పీల్చి వేస్తాయని, వీటి నివారణకు అబామెక్టిన్ మందును 0.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి అడుగు భాగం బాగా తడిచే విధంగా పిచికారీ చేసుకోవాలని సూచించారు. అధికంగా పూత రావడం కోసం నైట్రో బెంజిన్ 20 శాతం 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. దిగుబడి పెంచుకోవడం కోసం సూక్ష్మ పోషక మిశ్రమాన్ని 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో ఉద్యాన వన రైతులతో సమావేశం నిర్వహించి సాగుపై అవగాహన కల్పించారు. హెచ్ఇఓ శేషగిరి, వీఏఏ బాల వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

కనుల పండువగా వెంకటేశ్వర కల్యాణం


శ్రీవారి కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

కొనకనమిట్ల: స్థానిక రామదూత క్షేత్రంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. రామదూత క్షేత్రంలో 12వ ద్వాదశ శ్రీరామ నామ సప్తాహ మహోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. కల్యాణ ఉభయదాతలుగా కొత్తపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరరెడ్డి, లక్ష్మి, విష్ణువర్ధన్‌రెడ్డి, రత్నకుమారి, చెంచిరెడ్డి, గీతాంజలి, అనంతరెడ్డి, పల్లవి దంపతులు వ్యవహరించారు. గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్న సంతర్పణ చేశారు. సప్తాహ మహోత్సవాల సందర్భంగా నిత్యం రామనామ సంకీర్తనలతో భజనలు నిర్వహిస్తున్నారు. గురువారం సీతారామచంద్ర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి, వెలిశెట్టి వెంకటనారాయణ, ఎం.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

శ్రీవారికి విశేష పూజలు


వెలుగొండలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు


రేగడపల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తులు

కొనకనమిట్ల: కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం సందర్భంగా బుధవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే వాగుమడుగు పంచాయతీ రేగడపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు వేమయ్యస్వామి
ఆరాధన మహోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో వేమయ్యస్వామి

రాచర్ల: మండలంలోని చోళ్లవీడులో వేమయ్యస్వామి 262వ ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయాల కార్యానిర్వాహకులు బుధవారం తెలిపారు. వేమయ్యస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా 31వ తేదీ శుక్రవారం సాయంత్రం కులశ గ్రామోత్సవం, జూన్ 1వ తేదీన శనివారం ఆలయంలో తెల్లవారు జామున 4 గంటలకు గణపతి పూజ, అభిషేకం, అఖండస్థాపన, అంకురారోపణం, మండల అవాహము కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.


చోళ్లవీడులో వేమయ్యస్వామి ఆలయం